# హెచ్‌సీఏ టీ20 చాంప్ జిల్లా జట్టు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఏ డివిజన్ టీ20 లీగ్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జింఖానా మైదానం వేదికగా మారేడ్‌పల్లి కోల్ట్స్‌తో జరిగిన ఫైనల్లో ఉమ్మడి జిల్లా టీమ్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మారేడ్‌పల్లి కోల్ట్స్ నిర్దేశించిన 205 పరుగుల లక్ష్యఛేదనలో జిల్లా జట్టు 19.2 ఓవర్లలో 209/7 పరుగులు చేసింది. అర్ఫాజ్(52 నాటౌట్), హర్షవర్ధన్ సింగ్(49) రాణించారు. తొలుత మారేడ్‌పల్లి కోల్ట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 204/4 స్కోరు చేసింది. మికిల్ జైస్వాల్(64 బంతుల్లో 107, 8ఫోర్లు, 8సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. విజేతగా నిలిచిన ఉమ్మడి జిల్లా జట్టును హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కార్యవర్గ సభ్యులు ఆగంరావు, శ్రీనివాస్, రాజశేఖర్, రవికుమార్ అభినందించారు. ముమ్ముందు జరుగబోయే టోర్నీల్లో జిల్లా ప్లేయర్లు ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని ఆశిస్తున్నట్లు జగన్ పేర్కొన్నారు.

# కోహ్లీ, రాహుల్‌కు గాయాలు



పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టు మ్యాచ్‌కు ముందే భారత్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 22 నుంచి మొదలయ్యే టెస్టు కోసం జరుగుతున్న సన్నాహకాల్లో స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ గాయాలపాలయ్యారు. రెండు జట్లుగా విడిపోయి సాగుతున్న మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో రాహుల్ మోచేతికి గాయమైంది. దీంతో తీవ్రతను అంచనా వేసేందుకు రాహుల్‌ను స్కానింగ్‌కు పంపినట్టు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు కోహ్లీ గాయంతో బాధపడుతున్నట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ కథనంగా పేర్కొంది. ఆసీస్‌తో తొలి టెస్టుకు వీరిద్దరు అందుబాటులో ఉంటారా లేదా అన్నది అనుమానంగా మారింది.


# ఐపీఎల్ వేలంలో 574 ప్లేయర్లు

- తుది జాబితా విడుదల చేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ: జెడ్డా(సౌదీ అరేబియా) వేదికగా ఈనెల 24, 25 తేదీల్లో జరుగనున్న ఐపీఎల్ వేలంలో మొత్తం 574 మంది ప్లేయర్లు రాబోతున్నారు. ఇందులో రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్‌సింగ్ లాంటి స్టార్ క్రికెటర్లు 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి ప్రవేశిస్తున్నారు. బీహార్‌కు చెందిన అండర్-19 క్రికెటర్ 13 ఏండ్ల వైభవ్ సూర్యవంశీ అతిపిన్న వయసు క్రికెటర్‌గా వేలంలోకి వస్తున్నాడు. తొలుత 1574 మంది ప్లేయర్లు వేలంలో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా, ఇందులో నుంచి 574 మందితో బీసీసీఐ శుక్రవారం తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 366 మంది భారత ప్లేయర్లు కాగా మిగిలిన 208 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. 81 మంది ప్లేయర్లు 2కోట్ల కేటగిరీలో 27 మంది 1.5 కోట్ల విభాగంలో, 18 మంది 1.25 కోట్ల, 23 మంది 1 కోటి విభాగంలో ఉన్నారు.

## అన్షుల్ 10కి 10 వికెట్లు

### హర్యానా బౌలర్ అరుదైన రికార్డు



లాహిల్(హర్యానా): సుదీర్ఘ రంజీ ట్రోఫీ చరిత్రలో హర్యానా యువ పేసర్ అన్షుల్ కంబోజ్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు పడగొట్టిన అన్షుల్ ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. గ్రూపు-సీలో భాగంగా కేరళతో జరుగుతున్న మ్యాచ్‌లో అన్షుల్ ఈ ఫీట్ అందుకున్నాడు. 30.1 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన అన్షుల్ 49 పరుగులిచ్చుకుని 10 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తన స్వింగ్ బౌలింగ్‌తో విజృంభిస్తూ కేరళ బ్యాటరల పనిపట్టాడు. అన్షుల్ ధాటికి కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 291 పరుగులకు ఆలౌటైంది. అక్షయ్ చంద్రన్ (59) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు రంజీల్లో ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు తీసిన వారిలో ప్రేమాంగ్షు (బెంగాల్), ప్రదీప్‌సుదరమ్ (రాజస్థాన్) అన్షుల్ కంటే ముందు ఉన్నారు.

## టెన్నిస్‌కు ప్రజ్నేశ్ వీడ్కోలు

చెన్నై: భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తన ప్రొఫెషనల్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ విషయాన్ని శుక్రవారం తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అధికారికంగా ప్రకటించాడు. 2018(జకర్తా) ఆసియాగేమ్స్‌లో కాంస్య పతకం గెలిచిన 35 ఏండ్ల ప్రజ్నేశ్ తన రిటైర్మెంట్‌పై స్పందిస్తూ ఇక రాకెట్‌కు విరామం ఇస్తున్నాను అన్నాడు.



## శ్రీధర్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పుణె(మహారాష్ట్ర) వేదికగా జరిగిన 5వ జాతీయ పారా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన రాయల శ్రీధర్ కాంస్య పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన మిక్స్‌డ్ 10మీ ఎయిర్ రైఫిల్ స్టాండింగ్(ఎస్‌హెచ్2) వ్యక్తిగత ఫైనల్లో శ్రీధర్ 226.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. కుష్బు(యూపీ, 249.1), సిమ్రాన్‌శర్మ(హర్యానా, 248.6) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

# శాంసన్ తడాఖా

# తిలక్ పటాకా



శాంసన్ (109*)

### వాండర్సర్‌లో శతక గర్జన • భారత్ 20 ఓవర్లలో 283/1 • నాలుగో టీ20లో ఘన విజయం

**భారత బ్యాటర్లు దుమ్మురేపారు. దక్షిణాఫ్రికా గడ్డపై శతక గర్జన చేశారు. సఫారీలను సొంతగడ్డపై సఫా చేస్తూ రికార్డుల మోత మోగించారు. తిలక్‌వర్మ, శాంసన్ సూపర్ సెంచరీలతో కదంతొక్కిన వేళ వాండర్సర్ స్టేడియం పరుగుల వరదలో తడిసి ముద్దయ్యింది. కొడితే సిక్స్ లేదంటే ఫోర్ అన్న రీతిలో తిలక్, శాంసన్ వీరవిహారం చేశారు. సఫారీ బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ బౌండరీల సునామీ సృష్టించారు. బ్యాక్ టు బ్యాక్ సెంచరీతో తిలక్ వీరంగం చేస్తే.. శాంసన్ మరోమారు జూలు విదిల్చాడు. వీరిద్దరి బ్యాటింగ్‌కు ధాటికి రికార్డులు దాసోహం కాగా, విదేశీ గడ్డపై టీ20ల్లో భారత్ అత్యుత్తమ స్కోరు అందుకుంది. భారీ లక్ష్యఛేదనలో కంగుతిన్న దక్షిణాఫ్రికా ఓటమి మూటగట్టుకుంది. ఫలితంగా సిరీస్‌ను భారత్ 3-1తో కైవసం చేసుకుని ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది.**

**1** ఒక క్యాలెండర్ ఇయర్‌లో టీ20ల్లో మూడు సెంచరీలు చేసిన తొలి బ్యాటర్‌గా శాంసన్ నిలిచాడు.

టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి (పూర్తి స్థాయి సభ్యదేశాలు). ఓవరాల్‌గా ది మూడోసారి.

టీ20ల్లో ఏ వికెట్‌కైనా భారత్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం(210*).

విదేశాల్లో టీ20ల్లో టీమ్‌ఇండియాకు ఇదే అత్యుత్తమ స్కోరు(283/1).

**2** టీ20ల్లో వరుస మ్యాచ్‌ల్లో సెంచరీలు చేసిన రెండో భారత బ్యాటర్‌గా తిలక్‌వర్మ నిలిచాడు. ఇంతకుముందు శాంసన్ పేరిట ఈ రికార్డు ఉంది.

**23** టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక సిక్స్‌లు

*భారత్ ఇన్నింగ్స్:* ఫోర్లు: 17, సిక్స్‌లు: 23



తిలక్‌వర్మ (47 బంతుల్లో 120*, 9ఫోర్లు, 10 సిక్స్‌లు)

జొహాన్నెస్‌బర్గ్: ఈ ఏడాది పొట్టి ఫార్మాట్‌ను భారత్ భారీ విజయంతో ముగించింది. టీ20 ప్రపంచ చాంపియన్‌గా దక్షిణాఫ్రికా గడ్డపై అడుగుపెట్టిన టీమ్‌ఇండియా..సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. కుర్రాళ్లు, సీనియర్ల మేళవింపుతో బరిలోకి దిగిన భారత్ అనుకున్న ఫలితాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్‌సేన 135 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుని పొట్టి ఫార్మాట్ రికార్డును మరింత మెరుగుపర్చుకుంది. భారత్ నిర్దేశించిన 284 పరుగుల లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 148/10 స్కోరుకు పరిమితమైంది. స్టబ్స్(43) టాప్‌స్కోరర్. అర్ష్‌దీప్ సింగ్(3/20 ), అక్షర్‌పటేల్(2/6), చక్రవర్తి(2/42) రాణించారు. తొలుత హైదరాబాదీ తిలక్‌వర్మ(47 బంతుల్లో 120 నాటౌట్, 9ఫోర్లు, 10 సిక్స్‌లు), శాంసన్(56 బంతుల్లో 109 నాటౌట్, 6ఫోర్లు, 9సిక్స్‌లు) సెంచరీలతో భారత్ 20 ఓవర్లలో 283/1 స్కోరు చేసింది. తిలక్, శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు.

సఫారీల బౌలర్లను ఊచకోత కోస్తూ ఇద్దరు సెంచరీలతో విజృంభించారు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. తిలక్ వరుస మ్యాచ్‌ల్లో సెంచరీలు సాధిస్తే..శాంసన్ తొలి, ఆఖరి పోరులో శతకాలు ఖాతాలో వేసుకున్నాడు. వీరిద్దరు టీ20ల్లో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు చేసిన భారత బ్యాటర్లుగా నిలిచారు. తిలక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

**తిలక్, శాంసన్ శతక మోత:**

టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు అభిషేక్‌శర్మ(36), శాంసన్ మెరుగైన ఆరంభాన్నిచ్చారు. ఇన్నిరోజులు ఫామ్‌లేమితో సతమతమైన అభిషేక్ మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. శాంసన్ జతగా సఫారీ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. సున్నా పరుగుల వద్ద ఔట్ నుంచి బయటపడ్డ అభిషేక్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కొట్జె రెండో ఓవర్‌లో శాంసన్ సిక్స్, ఫోర్‌తో బౌండరీల మోత మొదలైంది. మరోవైపు అభిషేక్ కూడా బ్యాటు ఝులిపించాడు. సిమ్లెన్ ఐదో ఓవర్‌లో మూడు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 24 పరుగులు పిండుకున్నాడు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో అభిషేక్..సింపాల బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా 73/1 స్కోరు చేసింది. ఇక్కణ్నుంచి అసలు సినిమా మొదలైంది. బ్యాటింగ్ ప్రమోషన్‌లో మూడో స్థానంలో వచ్చిన తిలక్‌వర్మ వచ్చిరావడంతోనే సఫారీ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకపడ్డాడు. మొదట నెమ్మదిగా ఆడిన తిలక్..మహారాజ్ 9వ ఓవర్‌లో రెండు భారీ సిక్స్‌లతో తన ఉద్దేశమేంటో చెప్పాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన స్టబ్స్ ఓవర్‌లో శాంసన్ రెండు సిక్స్‌లు, తిలక్ రెండు ఫోర్లు బాదారు. ఈ క్రమంలో శాంసన్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, అగ్నికి ఆజ్యం తోడైనట్లు తిలక్ కూడా జతకలువడంతో స్కోరుబోర్డుకు పరుగులు వరద ఎత్తాయి. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని వీరిద్దరు బౌండరీలతో అభిమానులను అలరించారు. ఒక దశలో శాంసన్ కొట్టిన బంతిని ఒక మహిళా అభిమానికి బలంగా తాకడంతో ఏడుస్తూ కనిపించింది. మార్క్‌రమ్ 14వ ఓవర్లో తిలక్ వరుస బంతుల్లో 4,6, 6,4తో 22 పరుగులు సాధించాడు. ఒక స్థితిలో శాంసన్ ఆట కొంత మందగించగా, తిలక్ తారాజువ్వలా పేలాడు. కొట్జె 18వ ఓవర్‌లో శాంసన్ సెంచరీ సాధించగా, ఆ మరుసటి ఓవర్‌లో తిలక్ శతక నాదం పూరించాడు. మొత్తంగా వీరిద్దరు ఫోర్లు, సిక్స్‌లతో రెండో వికెట్‌కు 210 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టీ20ల్లో ఏ వికెట్‌కైనా భారత్‌కు ఇది అత్యుత్తమ భాగస్వామ్యం.

**సఫారీలు పోరాడినా:**

భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా స్వల్ప స్కోరుకే చాపచుట్టేసింది. యువ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్..సఫారీ టాపార్డర్ భరతం పట్టాడు. అర్ష్‌దీప్ ధాటికి హెండ్రిక్స్ (0), మార్క్‌రమ్(8),క్లాసెన్(0) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. మిడిలార్డర్‌లో స్టబ్స్ (43), మిల్లర్ (36) పోరాడేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆఖర్లో జాన్సెన్ (29 నాటౌట్) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 20 ఓవర్లలో 283/1(తిలక్ వర్మ 120 నాటౌట్, శాంసన్ 109 నాటౌట్, సింపాల 1/58),
**దక్షిణాఫ్రికా:** 18.2 ఓవర్లలో 148 ఆలౌట్(స్టబ్స్ 43, మిల్లర్ 36, అర్ష్‌దీప్ 3/20, అక్షర్‌పటేల్ 2/6)




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.